మోతీ

శ్రీమతి ఐ. వి. ఎస్. అచ్యుతవల్లి

నాకిప్పటికింకా బాగా జ్ఞాపకం వుంది. పది పన్నెండేళ్ల క్రితం సంగతయినా! ఇప్పటికి కూడా 'మోతీ' చిన్నప్పటి ముఖం, ముద్దులు మూట గట్టేట్టుండే, ఆ పసితనపు పాలనురుగులాంటి మృదుత్వంతో అమాయకత్వం తొణికిసలాడే, ఆ 'మోతీ' ముఖం కళ్లకి కట్టినట్లు కన్పించుతోంది! అసలు 'మోతీ' అనే పేరు నా కెందుకనో, చిన్నప్పట్నించీ అమితి ఇష్టంగా వుండేది. 'మోతీ' అంటే మంచిముత్యం! మంచిముత్యాలంటే నాకు, వజ్రాల కన్నా ఎక్కువ ఇష్టం! నా దుద్దులు, ముక్కుపుడకలు, మెళ్లో ఒంటివరస హారం, అన్ని మంచి ముత్యాలవే! పెళ్లిఅయినాక మా అత్తవారు ముత్యపు దుద్దులు, ముక్కుపుడకలు తీయించి, వజ్రాలవి పెట్టారు! ముత్యాన్ని హిందీలో 'మోతీ' అంటారు! ముత్యం, ముత్యాలమ్మ, ముత్తమ్మ - ఇలా పేరు పెట్టి పిలుచుకోటంకంటే, సున్నితంగా 'మోతీ' అని పిలుస్తుంటే ఎక్కువ శ్రావ్యంగా వినపడుతుంది. అందుచేత నాకు మోతీ అనే పేరే 'ముత్యం' అనే దాని కన్న ఎక్కువ నాజూకుగా వినపడుతుంది. చిన్నప్పుడు నా గదిలో ఒక పిల్లికి మూడు పిల్లలు పుట్టాయి. రెండు పిల్లిపిల్లలకి నల్లనల్లని మచ్చలున్నాయి. మూడో పిల్లిపిల్ల మచ్చలు లేకుండా, తెల్లగా దూదిపింజల్లే వుంది. ముందస్తుగా దానికి 'మోతీ' అనే పేరుపెట్టాను. దానిచేత వెండిప్లేటులో చిక్కని గేదెపాలు తెచ్చి నాకించేదాన్ని. కొంచెం పెద్దయినాక, మెళ్లో సన్నని బంగారు ఛాయగల పూసలు కట్టేను. అది ఎక్కడెక్కడికి తిరిగినా, రాత్రుళ్లు నా కాళ్ల వద్దకువచ్చి పడుకునేది. తెల్లవారి లేచేప్పుడు, కాళ్లు తీసుకోబోయేసరికి మ్యావ్‌మంటూ 'గుడ్ మార్నింగ్' చెప్పేది. లేవగానే పిల్లి ముఖం చూడకూడదని, మా అమ్మ కేకలేసేది. కాని మా 'మోతీ' ముఖం చూస్తే నాకేమీ అయ్యేదికాదు. 'మోతీ' పిల్లల్ని పెట్టకపోయినట్లయితే మా ఇంట్లోనే వుండేది. కాని కొన్నాళ్లయ్యేసరికి, అది పెద్దదయి, పిల్లల్ని పెట్టింది. వాటిని తీసుకుని ఎటో వెళ్లిపోయింది. నన్ను, నా ఆదరణనీ, ఆ పిల్లలకోసం వదులుకుని, వాట్ని రక్షించుకొని పెంచుకుందుకు, మా ఇంటినించి వెళ్లిపోయింది. అది వెళ్లిపోయిన వారం పదిరోజులుదాకా, నా కాళ్లదగ్గర రగ్గుక్రింద పడుకుని 'గుర్‌ర్' మంటోన్నట్లే నా కనిపించేది. కొన్నాళ్లుపోయేక, మా తమ్ముడు, చిన్నబొచ్చుకుక్క పిల్లని పట్టుకొచ్చేడు. తెల్లగా బొద్దుగావున్న ఆ కుక్క పిల్లకూడా చాలా ముద్దుగానే వుంది. దానికి 'మోతీ' అనే పేరు పెట్టమన్నాను నేను. 'ఛీ ఛీ! వెధవ పిల్లిపేరు నా కుక్కకి పెట్టటానికి వీల్లేదు' అన్నాడు వాడు. కాస్సేపు రాజా అనీ, మరో కాస్సేపు జిమ్మీ అనీ పిలిచేవాడు. నాకు ఆ కుక్కపిల్లన్నా సరదాగానే వుండేది. కాని నేను చెప్పినపేరు పెట్టలేదనే కోపంతో అటొచ్చీ ఇటొచ్చీ, కాళ్లతో తన్నుకుంటూ పోయేదాన్ని! అది మహరాక్షసి! కాస్త కాలు తగిలీ తగలకుండానే, కుంయి కుంయిమంటూ ఒక గంటదాకా అరుస్తూ ఇల్లంతా గీరుగారు మనిపించేసేది. దానితో మా తమ్ముడు, 'దానిపిల్లి ఎక్కడికో పోయిందని, నా కుక్క పిల్లని చంపేస్తోంది అక్క!' అంటూ గోలచేసేవాడు. ఇంకొంచెం పెద్దయినాక, మా యింటి ప్రక్కన అద్దెకు దిగిన అరవవాళ్లింట్లో, రెండు తెల్లని కుందేళ్లు వుండేవి! వాటిపేర్లు, మోతీ, జోతీ! వాటిని వదలి నేను ఒక్కక్షణంకూడా వుండేదాన్ని కాదు! కాని అకస్మాత్తుగా ఆ కుందేళ్లని, ఎవరిదో కుక్కవచ్చి చంపిపోయింది. పాపం వాళ్ల పిల్లలుకూడా చాలా బెంగపెట్టుకున్నారు. నాకూ బెంగవేసింది! నేను పెరిగి పెద్దయ్యాక గృహిణిగాకూడా మారేక,

'మోతీ మోతీ' అనే సన్నటి పిలుపు మృదుమధురమైన సంగీతంలా విన్పించింది!

అది భాద్రపదమాసం! వర్షాలు జోరుగా కురిసి వెలిసిపోయే కాలం! కాస్తలో నాలుగుప్రక్కలనించీ, నీలి నీరదమేఘాలు ఆపసోపాలుపడుతూ ఆకాశాన్నంతా అలుముకునేవి! అంతలో చిటుకు, చిటుకుమంటూ సన్నసన్నటి జల్లులుగా మొదలయిన వర్షం, క్షణంలో కుంభవృష్టిగా కురిసిపోయేది! కురిసీ కురిసీ విను గత్తిపోయిన మేఘాలు, తమ మనస్సుల్లోని బరువునంతా కన్నీటితో క్షాళితం చేసుకున్న వ్యక్తుల్లా, తేలికగా, తెల్లబోయి, సూర్యకాంతి వెచ్చదనానికి కరిగిపోతూ చిన్నచిన్న దూదిపింజలల్లే గాభరాగా అటూ ఇటూ ఆకాశాన్నిండా పరుగులెత్తుకునేవి! అంత క్రితంరోజు రాత్రి సినిమాచూసి రావటంవించి, ఉదయం ఏడుగంటలయినా, నేను ప్రక్కమీంచి లేవకుండా, అల్లానే దొర్లుతున్నాను. ఇంతలో 'మోతీ, మోతీ' అనే పిలుపు క్రింది వాటాలోంచి విన్పించింది! ఆ పిలుపు నా చెవిని సోకగానే, నా నిద్ర బద్ధకం అంతా ఒక్కక్షణంలో ఎగిరిపోయింది!

మేము వుండేది మేడమీద చివరిభాగంలో! మేడమీద మేముకాక, మా ఇంటియజమాన్లు కూడా వుంటున్నారు. మేడక్రింద వరసగా నాలుగయిదు వాటాలు వున్నాయి! నాలుగయిదు కుటుంబాలవారు అందులో వుంటున్నారు. సాధారణంగా అవి ఎప్పుడూ ఖాళీగా వుండవు! ఒక సంసారం ఖాళీచేస్తారని తెలియగానే ఇంకో కుటుంబంవచ్చి దిగిపోతూవుంటారు! అసలు ఖాళీచేయకుండానే ఎడ్వాన్సులు పుచ్చేసుకుంటూ ఆ ఇంటి వాటాలను, వాగ్దత్తం చేస్తూవుంటారు మా ఇంటివారు! మేము ఆ మేడలోకివచ్చి రెండేళ్లు దాటుతోంది! మేము అక్కడ వుంటూండగానే, ఆ క్రింది వాటాలలో అయిదారు కుటుంబాలు మారటం జరిగింది! ఆ మేడకి మేమే పాతకాపులమయ్యాము అన్నమాట! 'మోతీ' అనే పేరు వినగానే, 'మళ్లీ' ఏదో కొత్తసంసారం, క్రింది వాటాలోనికి వచ్చివుంటుందని వూహించాను. లేచి మంచం నడుంగా కూర్చొనే కిటికీలోంచి క్రిందకు చూశాను. మేము వుండే మేడకి పెద్దకాంపౌండూ, గేటూ వున్నాయి. ఒకమూలగా రెండు కుళాయి లున్నాయి! కాంపౌండుఅంతా నాలుగయిదు బాదంచెట్లూ, నాలుగయిదు రాచవుసిరిచెట్లూ, రెండు పొన్నచెట్లూ వుండి నీడగా వుంటుంది. బాదంచెట్లమ్రానులనిండా, వల్లని పెద్దచీమలు ఏకాలమూ పాకుతూవుంటాయి! వానవచ్చి వెలిసినాక పొన్నపూలు అన్నీ తడిసి రెక్కలూడిపోయి క్రిందికి రాలిపోతాయి!

రాచవుసిరి చెట్లమీద చేరిన కాకులూ, పిచ్చికలూ, ఒకటే రణగొణ ధ్వనిచేస్తూ, పసిరికాయలన్నీతెంపి క్రిందపోస్తూ వుంటాయి. పెరడు అంతా ఎండిపోయి రాలిపోయిన బాదం, పొన్న ఆకులతో నిండిపోయి, గత్తరగా వుంటుంది. సాయంకాలాలు క్రింది వాటాల్లోని పిల్లలూ, వాళ్ల స్నేహితులయిన ఇరుగు పొరుగు ఇళ్లల్లోని పిల్లలూచేరి గోలగోలగా అరుస్తూ, ఆటలు ఆడుకుంటూ వుంటారు. అప్పుడప్పుడు, క్రింది వాటాల్లోని ఇల్లాళ్లు ఆ చెత్త ఆకుల్ని వూడ్చి కుప్పపెట్టి అంటించి, దానిమీద ఒక కుండెడు నీళ్లు కాచుకొంటూ వుంటారు. గాలి వేసినప్పుడు ఆ బూడిదంతా ఎగిరి పెరడంతా పరుచుకుంటూ వుంటుంది. క్రితంరాత్రి చివరి ఝాములో వర్షం కురిసినట్లుంది. ఆకాశం అంతా, శుభ్రస్నాతలా, నీలంగా నిగనిగలాడుతోంది! చెట్ల ఆకులన్నీ ముదురాకు పచ్చగా, చేయి తిరిగిన చిత్రకారుడు రచించిన తడియారని, వర్ణప్రకృతి చిత్రంలోలా పచ్చిగా కళ్లకి చల్లగా కన్పించుతోన్నాయి!

ఆ సుప్రభాత సమయాన్ని, ఆ పెరట్లో ఒకమూలగా, కుళాయివద్ద ఇత్తడిబాల్చీతో నీళ్లుపట్టుకుంటోన్న—పది ఏళ్లుపైగా వుండవచ్చు అనుకునే పిల్లమీద నా దృష్టి పడింది! ఆ పిల్ల గోధుమరంగుగా వున్న చిన్నలాగూ వేసుకుంది. అంతకన్న వేరేబట్ట ఆ పిల్లవంటిమీద లేదు. ఆ లాగూకూడా నీళ్లు జేరవేయటంవించి, తడిసిపోయి, పిక్కలకి అంటుకుపోయింది. పిల్ల చక్కగా గుండులాగుంది. చామనచాయలో గుండ్రటిముఖం! పెద్దపెద్ద కళ్లు. తీరైన ముక్కు. బుల్లిమందార మొగ్గలాంటి నోరు. ముద్దుగా వుంది! గుండ్రంగా బలంగావున్న తొడలకి అంటిపెట్టుకునున్న ఆ లాగూ ఆ పిల్లకి నడుందాకా రాలేదు! బొడ్డుక్రిందకి మాత్రమే సరిపోయింది! ఆ పిల్ల బాల్చీ నింపుకుని, రెండు చేతులతో ఎత్తిదింపుతూ,

ఎత్తలేక దింపుతూ దింపుతూనే ఎల్లాగో చివరి వాటా తొనికి నీళ్లు జేరవేస్తూంది. అరగంట గడిచేసరికి ఆ పిల్లపేరే మోతీ అని నిర్ధారణ అయిపోయింది! నాకు ఆ పిల్లని చూస్తోంటే పారిపోయిన తెల్లపిల్లి, తెల్లకుక్క జిమ్మీ, తెల్లని కుందేలు పిల్లలూ జ్ఞాపకానికి వొచ్చాయి! చక్కగా ఆరోగ్యంగావున్న పిల్ల! అందమైన పేరు!

మోతీ నీళ్లు పట్టుకుంటూ వుండగా ఇంకా ముగ్గురు నలుగురు పిల్లలు, అంతకు మునుపు నేను చూడని పిల్లలు, మోతీవద్దకుచేరి కబుర్లు చెబుతున్నారు. మోతీ కళ్లు పెద్దగా గుండ్రంగా వుండి, చూసే వాళ్లకి జాలి చూపులు చూస్తోన్నట్లు కనిపించేవి! మధ్యాహ్నం భోజనాలయినాక, నేను క్రిందికి వెళ్లి 'మోతీ'ని పలుకరించాను. మోతీ వాళ్లింట్లో నేను వెళ్లేసరికి పరిచయం చేసుకోదగ్గంత పెద్ద సభ్యులెవరూ లేరు! మోతీతో నలుగురు పిల్లలు మటుకు వున్నారు!

నలుగురు పిల్లలూ ఎనిమిదినించీ, మూడు ఏళ్ల వయసులో వున్నారు. మోతీ వాళ్లకి పెద్దదిక్కన్నమాట! ఆ పిల్లల తల్లి ఇందిరమ్మ, తండ్రి రాజారావూకూడా ఏవో ఆఫీసుల్లో ఉద్యోగాలు చేస్తున్నారట! ఇందిరమ్మకి 'మోతీ' ఎక్కడ్నో దూరపు వరసన మేనకోడలు అవుతుందిట! మోతీ తండ్రి ఏదో ఆఫీసులో ప్యూన్‌గా వున్నాడట! ఎనమండుగురు పిల్లలున్న కుటుంబంలో 'మోతీ' ఆరో ఆడపిల్ల! కడం వాళ్లిద్దరే, మోతీ తల్లిదండ్రులుకి మగపిల్లలు! 'మోతీ' చాలా కలుపుగోలుతనంగా వుండేది. ఇందిరమ్మ పిల్లలచేత శుభ్రంగా సబ్బుపెట్టి వళ్లు తోమి స్నానాలు చేయించేది. ఏ పూట కాపూట ఆ పిల్లల బట్టలన్నీ ఉతికి ఆరవేసేది! పిల్లల పోషణంతా మోతీయే చేసేది! ఇంట్లో అంట్లగిన్నెలు తోమటం, నీళ్లు జేరవెయ్యటం, కూరా నారా తరిగి ఇవ్వటం, భోజనాలయ్యాక ఎంగిలి పళ్లేలూ, గిన్నెలూ కడగటం—ఒక పనేమిటి? ఇల్లు సర్వమూ ఆ పిల్లే చక్కబెట్టేది! ఇందిరమ్మ సన్నగా పొడుగ్గా, రివటలాగుండేది! నూట యాభయి రూపాయిలు దాకావచ్చే వుద్యోగం ఏదో చేసేది! రాజారావుకికూడా రెండు వందలదాకా వచ్చేది! ఏవేవో కాంపులుండే వుద్యోగం చేసేవాడు! మనిషి పొడుగ్గా దృఢంగా వచ్చగా వుండేవాడు. అతని ముందు ఇందిరమ్మ ముక్కుతూ మూలుగుతూన్నట్లు, తోస్తేపడిపోయేట్లు వుండేది! అసలే చామనచాయరంగు ఇందిరమ్మది! ఆ పయిన సన్నటి నాజూకు వళ్లు! దృఢమైన రాజారావుముందు ఇందిరమ్మ తీపికట్టుగా వుండేది! పిల్లలూ నలుగురూ సామాన్యంగా వుండేవాళ్లు. అంత జనముద్దయిన పిల్లలుకారు! ఆ కుటుంబానికంతటికీ, మంచి బట్టలు ధరించలేకపోయినా కడిగిన ముత్యంలా, 'మోతీ'యే ఆకర్షణీయంగా కనిపించేది!

మోతీకి నా వద్ద బాగా చనువయిపోయింది. ఇందిరమ్మకూడా అప్పుడప్పుడు మేడమీదకువచ్చి నాతో నాలుగు కబుర్లుచెప్పిపోతూ వుండేది! ఇందిరమ్మకి అస్తమానూ 'మోతీ' గురించి పొగడటంతోనే సరిపోయేది!

'ఏదో చిన్న పిల్లది అయినా ఇల్లంతా సర్దుకుని వస్తున్నది వదినగారూ! అది వున్నది కనుక, నేను, నలుగురు పిల్లలున్నా, బయటికిపోయి వుద్యోగం చేసుకురావటానికి వీలవుతున్నది! అన్నిపనులూ నా చేతిలోవి అందుకుని చేసుకుపోతుంది!' అనేది.

ఇంకోసారి 'మోతీ పెళ్లి బాధ్యత మాదే వదినగారూ! ఇంతలా ఇల్లు దిద్దుకునే ఆడపిల్ల ఎవరున్నారు? ఈడేరగానే, రెండు మూడు వేలు ఖర్చుపెట్టి అయినా, నాలుగు డబ్బులు వెనక వేసుకున్న వాడికిచ్చి కట్టబెడతాం!' అనేది. 'మోతీ' మీద ఇందిరమ్మకి అపాయకరమైన వాత్సల్యమూ, నమ్మకమూ వుండేవి!

ఇందిరమ్మ ఇల్లా అస్తమానూ మోతీని పొగుడుకుంటూ కబుర్లు చెప్పేదా? మోతీమటుకు ఇందిరమ్మమీద ఏమాత్రం మంచి కబుర్లు చెప్పేది కాదు! మోతీకి వున్నవి పదకొండేళ్లయినా పాతికేళ్లు పైబడిన పడుచు కబుర్లలా ముదినాపసానిలా మాట్లాడేది!

'మా అమ్మతో నాకు పై చదువులు చెప్పిస్తానని చెప్పి తీసుకొచ్చింది! తీరా ఇక్కడకు వచ్చేక, వున్న పనిమనిషిని మానిపించేసి ఆ దాసీ పనులన్నీ నాకంటగట్టింది! తీరా వచ్చేక పనులు చేయలేనని, మొరా

యించుకు కూర్చుంటే బాగుంటుందా చెప్పండి!' అంది.

'నువ్వెంతవరకు చదువుకున్నావు?' అడిగాను.

'మా వూళ్ళో వీధిబడిలో అయిదో క్లాసు వరకూ చదువుకున్నాను. తనకి సాయిలాగా ఒక పిల్ల కావాలనీ, నాకు ఎంతవరకు చదువుకోవాలనీ వుంటే అంతవరకూ తను చదువు చెప్పిస్తానని, మా అమ్మతో చెప్పింది! ఇక్కడికివచ్చి ఏడాదిపైన అయిందా? నా చదువు వూసే ఎత్తటం లేదు మా అత్త!' అంది మోతీ.

మోతీ జుట్టు వొత్తుగా ఎర్రగా వుండేది. భుజాలమీదికి పడేట్లు కత్తిరించి వుండేది!

'ఎదగనిస్తే పొడుగాటి జడ అవుతుంది నీకు. అదేం అల్లా పొట్టిగా కత్తిరిం చేసుకుంటావు?' అన్నాను ఒకసారి.

'మా అత్త తలకు రాసుకుందుకు నూనె వారాని కోసారన్నా ఈయదు! జుట్టు పొడుగు పెరుగుతే నూనె ఎక్కువ పీలుస్తుందని జుట్టు పొట్టిగా కత్తిరించేసుకోమంటుంది! నేను కత్తిరించుకోకపోతే తనే కత్తిరించేస్తుంది! నాకు పెద్దజెడ వేసుకోవటం సరదా! మా అక్కలకయితే మోకాళ్ళు దాటేవరకూ పెద్దపెద్ద జడలున్నాయి!' అంది పాపం.

చిన్నపిల్లని చదువు చెప్పిస్తానని ఆశలుపెట్టి తీసుకువచ్చి, ఇంటి పనుల్లో రాచిరంపాన్న పెట్టటం నాకు అశాంతి కలిగించింది! విరియని గులాబీ మొగ్గలాంటి మోతీకి, అంట్లుతోమటం, బట్టలుతకటం లాంటి బండపనులు చెప్పగలిగిన దాక్ష్మీకం పీలగా రోగిష్ఠిలావుండే ఇందిరమ్మకి, నలుగురు పిల్లల్ని కన్న పిల్లల తల్లి ఇందిరమ్మకి ఎల్లా కలిగిందో నా కాశ్చర్యం కలిగించింది! మోతీ జాలి గొలిపే చక్రాల్లాంటి కళ్ళచూపులు, ఎప్పుడూ తడి ఆరకుండా అప్పుడే విచ్చుకున్న పారిజాతపు పూవులాంటి మృదువైన మోతీ లేత శరీరం, నా గుండెల్లో బలంగా చెరగని ముద్రవేసుకుని అహోరాత్రాలు నన్ను వెంటాడేవి! నాది ప్రయోజనంలేని సానుభూతి కాకూడదు! నా అంతట నేను మోతీకోసం, నా కిష్టమైన పేరుగల మో కోసం ఏదన్నా హాయం చేయగలగాలి అన్న పట్టుదల నా నరనరాల జ్వలించి పోయింది!

'ఇందిరమ్మ మన మనుకున్నంత మంచి మనిషి కాదు!' ఒకనాడు ఆయన భోజనం చేస్తుండగా నాందీ ప్రస్తావనగా అన్నాను.

'ఏం! వుద్యోగం చేస్తోందనా?' అన్నారు.

నాలాంటి, ఇంట్లో కూర్చునే ఇల్లాళ్ళకి (ఆయన దృష్టిలో కూపస్థమండూకాలు) బయటకు వెళ్ళి నాలుగు డబ్బులు సంపాదించుకోగలిగిన చదువుకున్న ఇల్లాళ్ళంటే జెలసీ పుట్టుతుందని, మా ఆయన అభిప్రాయం! (చాలామంది మగమహారాజుల కదే అభిప్రాయం కలగొచ్చును.)

'ఛ! ఛ! అది కాదు. పాపం, మోతీని చూడండి! చదువు చెప్పిస్తానని తీసుకొచ్చిందిట! ఆ వంకతో ఆ పిల్లని తీసుకొచ్చి ఇక్కడ ఆమెగారు నేర్పిస్తోన్న విద్య ఏమిటో చూశారా? అంట్లు తోమటం, పిల్లల్ని కనిపెట్టుకుని వుండటం! చూడండి! ఎంత అన్యాయమో!' అన్నాను.

'అన్యాయ మేమిటి సింగినాదం! అదీ ఒక చదువే! హోంసైన్సు అన్నమాట! రేప్పొద్దున్న ఆ పిల్ల పెద్దదయితే పనిమనుషుల్ని భరాయించాల్సిన అవసరం లేకుండా ఇల్లంతా దిద్దుకోగలదు! ఇంటి విషయాలకి పనికిరాని చదువు లెందుకు? డిగ్రీ లెందుకు? స్క్వ్యేర్‌వాచీలు, రెండు జడలూ, నైలాన్ చీరలూ కట్టుకుని తిరగటానికా! ఈ విషయంలో ఇందిరమ్మ గారిని అభినందిస్తున్నాను!' అన్నారు. నాకు చిరాకెత్తుకొచ్చిన మాట నిజం!

'తలకు రాసుకుందుకు నూనె కూడా ఈయదట! నూనె ఎక్కువ అవుతుందని, జుట్టు కత్తిరిం చేసుకోమంటుందిట! పాపం మోతీకి చదువుకోవాలని ఆశ! కాని ఆ పిల్లకి ఇంటిచాకిరే సరిపోయే! ఇంక చదువుకుందుకు తీరికెక్కడుంటుంది?' అన్నాను జాలిగా.

'భేష్! పొదుపుచేయటం ఇందిరమ్మ దగ్గరే నేర్చుకోవాలి! ఏ తలనూనె సీసా ఖరీదు చూసినా ఆరూ, ఏడూ రూపాయిలు పెడితేకాని రావటం లేదు! బాబ్డ్‌హెయిర్ అయితే, ఈ నూనె ఖర్చు తగ్గుతుంది! అప్‌టుడేటుగానూ వుంటుంది! ఏమి

ఐడియా! ఆమె తెలివితేటలకి ఆర్థిక మంత్రిణి అవ్వొచ్చును. కాని జాతకం కలిసిరావటం లేదు కాబోలు! నువ్వూ వున్నావు! వున్నజుట్టు చాలక, తెగబారెడు సవరానికి కూడా పూస్తో వుంటావు నూనెని! నీ తలకి నూనె రాస్తే జుట్టు పెరుగుతుంది అనుకోవచ్చును! సవరానికికూడా నూనె పూస్తూ వుంటావు దేనికి? ఆ జుట్టుకూడా పెరుగుతుందా! అహ! నాకు తెలీక అడుగుతున్నా!' ఆయన తీరు ఇది! ఆ వేళాకోళానికి నాకు ఏడుపు వచ్చినంతపని అయ్యింది. కాని కార్యార్థినై వున్నాను కనుక కళ్లమ్మట గిర్రుమని తిరగబోయే కన్నీరుని కళ్లల్లోనే ఇంకించుకొందుకు ప్రయాసపడి సాధించాను. ఒక్కక్షణం వూరుకుని మళ్లీ అన్నాను:

'పాపం! మోతీని చూస్తే జాలివేస్తూంది! హాయిగా ఆడుతూ పాడుతూ పెరగాల్సిన పిల్లకదా! ఆ వయస్సులోనే తన పొట్ట తాను పోషించుకుందుకు కష్టపడి పనిచేయాల్సివస్తోంది. నలుగురు పిల్లల్ని సరిదిద్దుకుంటూ, ఆ పిల్ల ఇంకేం చదువుకుంటుంది? అంచేత పోనీ మనింట్లో వుంచుకుందామనివుంది! మనింట్లో అయితే ఇద్దరమే కాబట్టి పని తక్కువగా వుంటుంది! తీరికవేళల్లో చదువు నేనైనా చెబ్తాను. కొంచెం స్టాండర్డు పెరిగాక, ప్రయివేటుగా ఏ థర్డ్‌స్టాండర్డ్ పరీక్షకో కట్టించవచ్చును! అల్లా దాని భవిష్యత్తుకి ఒక బాట ఏర్పాటుచేయవచ్చును! ఏమంటారు?' బితుకు బితుకుమంటూ నా మనసులోని మాట చెప్పాను. ఆయన ఫక్కుమని నవ్వారు.

'పిచ్చిదానా! నువ్వు వకర్తివీ ఎంతమందిని ఉద్ధరించగలవు? అంత దయగా తీసుకువచ్చి, తన పిల్లలతో సమానంగా పెంచుకొంటూన్న ఇందిరమ్మమీదే అది చాడీలు చెప్పుకొచ్చింది! ఇప్పట్నించీకూడా ఆ పిల్లకి తన్నిచూచి అందరూ జాలిపడాలి అనే మనస్తత్వం బాగా పేరుకొంది! నీవయినా, నీ ఇంటి పనులు చేయించుకుని, ఇంత తిండి పడేయగలవుకాని, నీ ఐశ్వర్యానికి దత్తత చేసుకుంటావా? ఇందిరమ్మమీద చాడీలు చెప్పినది, నీమీదమటుకు చెప్పదని రుజువు ఏమిటి! ఆ పిల్లకి యజమాని సానంలో వుండి నీవు చేయగల ఉపకారంకంటె, ఇల్లా పరోపకారంగా, సానుభూతిగా చేయగల ఉపకార మేదైనా వుంటే చేయి! యజమానిస్థానం నువ్వు తీసుకున్న మర్నాడు, ఆ పిల్ల మనసులో నీ పట్లవున్న కృతజ్ఞత మాసిపోతుంది! ఆ పిల్ల కళ్లకి నీవు మరొక ఇందిరమ్మలా కనిపించుతావు. అంతే!' అన్నారు. మోతీని మా ఇంట్లో వుంచుకోవటం ఆయనకి ఇష్టం లేదని తేలింది.

'రోజూ మధ్యాన్నంపూట వస్తూండు మోతీ! ఎక్కాలూ హిందీ నేర్చుకుందుకాని!' అన్నాను. అప్పట్నించీ మోతీ రోజూ మధ్యాన్నం మా ఇంటికి వచ్చేది. మొదట్లో ఒకటి రెండు రోజులుపాటు, నాలుగోఎక్కం, హిందీలో క గుణింతం శ్రద్ధగా చదివి దిద్దుకునేది. రానురానూ తనకి అవి రావటంలేదని, ఇంట్లో పని తీరటంలేదనీ, చదువుకోవటం ఎగగొట్టేది! మా ఇంట్లో ఏవన్నా ఫలహారాలు చేసుకుంటే పెట్టేదాన్ని! మేడ దిగకుండానే తినేసేది! నలుగురు చిన్నపిల్లలున్నారుకదా—వాళ్లకి కాస్తన్నా పెట్టేదికాదు!

'వాళ్లూ పసివాళ్లుకదా! వాళ్లని కూడా పిల్చిపెట్టు!' అనేదాన్ని.

'వాళ్లకేం మాయరోగమా! పీకనిండా అన్నం తిన్నారా? వాళ్లమ్మ వాళ్ల ఫలహారాలకోసమని అర్ధరూపాయి ఇచ్చివెళ్తుంది రోజూనూ! నేను కొని పెడుతున్నాగా!' అనేది. నా అంతట నేను ఏదో ఒకటి చేసిపెడుతూనే వుండేదాన్ని! అదికాక రోజూ ఏదో వకటి అప్పులు పట్టుకెళ్తూ వుండేది. ఒక పావు మైదా అనీ, ఇంకో పావు శనగపిండి అనీ, ఒక గిన్నెడు డాల్డా అనీ, ఇల్లా రోజూ ఏదో ఒకటి ఇందిరమ్మ ఇమ్మన్నదని అడిగి పట్టుకువెళ్తూవుండేది! కొన్నికొన్ని సామాన్లు తిరిగి ఇచ్చేది. కొన్నిసామాన్లు తిరిగి ఇచ్చేదికాదు!

'మోతీ' వాళ్లు ఆ ఇంటికి వచ్చేక, మేము ఆ వూళ్లో ఆరునెలలు మాత్రమే వున్నాము. మా వారికి ట్రాన్స్‌ఫర్ అవటంనించి మేము ఇంకో వూరు వెళ్లిపోయాము. మేము వెళ్లిపోతూంటే 'మోతీ' దిగాలుగా నించుంది. నేను అయిదు రూపాయలు ఆ పిల్లచేతిలో పెట్టాను!

రెండేళ్లు గడిచాక మా బంధువుల ఇంట్లో

పెళ్లిఅయితే, ఆ వూరు వెళ్లటం తటస్థించింది. అప్పుడు మేము వుండే ఆ మేడకి కూడా వెళ్లేను. మా ఇంటావిడ నన్ను చాలా మర్యాద చేసింది. ఆమెని 'మోతీ' గురించి అడిగాను. ఇందిరమ్మ వుద్యోగం మానేసిందట! రాజారావుకి మంచి ప్రమోషన్ వచ్చిందిట! రెండునెలలు క్రితమే ఇంకోవూరు ట్రాన్స్ఫర్ అయి వెళ్లారుట! ఇంటావిడ చెప్పారు.

'మోతీ బాగా వుందా? బాగా ఎదిగివుంటుందనుకుంటాను' అన్నాను.

'బాగా పొడుగెదిగింది! వోణీలు వేసుకుంటోంది! ఆ ఇందిరమ్మ ఎంత బాగా పెట్టినా, అదేం ఖర్మమోకాని, ఆ పిల్ల ఇరుగిళ్లకి పొరుగిళ్లకి వెళ్లి అవి లేవు, ఇవి లేవు అని అడిగితెచ్చుకోవటం మానేది కాదు! ఆ ఇందిరమ్మ ఎంతో దేవులాడేది పాపం!' అంది ఇంటావిడ!

'ఎదిగే పిల్ల కదా! సహజంగా ఆరోగ్యవంతమయిన పిల్ల! ఆకలికి ఆగలేక అడిగివుంటుంది!' అన్నాను. ఏది పెట్టినా ఆవురావురుమంటూ తినేసే జాలికళ్ల మోతీ నా గుండెల్లోంచి ఒక్కసారి తొంగి చూసింది!

'ఇందిరమ్మ అంత కక్కూర్తి మనిషి కాదు స్మండీ! కడుపునిండా తన పిల్లలతో సమానంగా పెట్టేది భోజనం! అయిదు గురికీ సరిపడగా మధ్యాహ్న ఫలహారాలకి డబ్బు లిచ్చేది! ఇది ఏంచేసేదో తెలుసునా! ఆ డబ్బులన్నీ పెట్టి తను కడుపునిండా, హోటల్లోపడి మెక్కేసేది! ఒక అణావో, బేడోపెట్టి కారపుశనగలో, వేరుశనక్కాయలో కొని, ఆ పిల్లల ముఖాన్న పడేసేది! ఆ కుర్రవెధవలు అవే నములుకుంటూ కూర్చునేవారు! పిల్లల్ని సినిమాలకి తీసుక వెళ్లమని డబ్బులిస్తే ఆ డబ్బులూ అల్లానే తను తినేసేది! సినిమా వదిలే టయిమయిందాకా ఏ పార్కులోనో పిల్లల్ని పెట్టుకుని కూర్చుని సినిమాహాలులోంచి, జనం బయటకు రాంగానే తనూ పిల్లలని తీసుకునివచ్చేది! కొంచెం జ్ఞానం తెలిసిన పెద్ద పిల్లలు, అమ్మతో చెబ్తామనిఅంటే, వాళ్లని గిల్లి రక్కి హింసించేది! దానికి భయపడి, ఆ పిల్లవెధవలు కిక్కురుమనేవారుకారు! పైకి అల్లా వుంటుంది కానీ, 'మోతీ' వుత్త వాలిముచ్చుముండ!' అన్నారు. ఆవిడ. 'మోతీ'ని అల్లా విమర్శిస్తూంటే నాకు కష్టం తోచింది! 'మోతీ' అమాయకపు పిల్ల! రోజల్లా చాకిరీ చేసేది కనుక, కాస్త ఆకలి ఎక్కువగానే వుండి వుంటుంది! దానికి ఇంత కఠినమైన మాటలు పడాలా!

'అన్ని తెలివితేటలున్న పిల్లలా కన్పించేది కాదండి మోతీ!' అన్నాను బాధగా. కుర్రపిల్ల కడుపాకలికొద్దీ ఏదో తింటే, దానిని నీచబుద్ధిక్రింద జమచేస్తారా! ఆకలి ఎరుగని అజీర్తి వ్యక్తులు?

'అమ్మమ్మ! అది రావణాముండస్మండీ! దాని దెంత ఆకలో! దానిది కడుపో, కాళింగ మడుగో కాని, ఒక్కరోజన్నా ఆ పిల్లవెధవలకి సరయిన ఫలహారం తెచ్చిపెట్టేదికాదుకదా! ఆ పిల్లలు సరయిన పోషణలేక 'గీరుగారు'మంటూవుంటే, ఇది తెగతిని రోజురోజుకీ అడివిపందిలా బలిసిపోయేది! ఇంక ఈ ముండ ఎదిగాక, ఆ రాజారావు ఇందిరమ్మకన్న పెందరాళే ఆఫీసునించి ఇంటికి రావటం ప్రారంభించాడు! పెద్దజెడా, ఛాతీమీదకు సగానికి తక్కువ వెడల్పుగా వోణీ వేసుకుని, మామయ్యగారూ, మామయ్యగారూ అంటూ అతగాడి కూడా తిరుగుతూంటే నాకు మాచెడ్డ సిగ్గేసేది!'

'మీ కెందుకు మధ్యన సిగ్గు?' అందామనుకుని నాలికని కట్టేసుకున్నాను.

'మా రాజాగాడు ఇంట్లో వున్నాడంటే చాలు! జడ ముందుకువేసుకుంటూ చకచకా మేడమీదకు వచ్చేసేది! వెధవకళ్లు జాలిగా త్రిప్పుకుంటూ మాట్లాడుతూంటే వయసులో మగపిల్లలు వలలో పడటం ఎంతసేపు చెప్పండి! అందులో ఈ సినిమాలు చూసారా! ఎంతసేపూ ప్రేమించుకోడాలూ, తోట లమ్మటా, దొడ్లమ్మటా ఒకళ్లవెంట ఒకళ్లు పరుగులు పెట్టుకుంటూ కెవ్వుమంటూ పాటలు పాడుకోడాలూతప్ప, కాస్త నీతీ నియమాలూ చెప్పేవి ఏమన్నా వున్నాయా! ఇందిరమ్మతో కచ్చితంగా చెప్పేసేను! 'నీ వుద్యోగం వూళ్లే–! ముందు నీ భర్త సంగతి చూసుకోవే, పిచ్చిరండకానా! నాలుగు రోజులు గడిచాయంటే, నువ్వూ, నీ

పిల్లలూ, నా బొందో అంటూ రోడ్డట్టుకుని బయటకు పడవ్వాలసిందే! నీ సంసారం అంతా 'మోతీ మహల్' అయిపోతుంది, నువ్వు కానుకో కుంటేను.' అని చెప్పాను. దానితో ఇందిరమ్మ వుద్యోగానికి రిజైన్ ఇచ్చేసింది. ఇక్కడ్నుంచి వెళ్లే సరికి ఇంకా మోతీ వదలలేదు వాళ్ళని. ఇప్పు డింకా వుందో వెళ్ళిపోయిందో మరి!' అన్నారు ఇంటావిడ. నేను ఎంత గింజుకున్నా నా మనోయవనికమీద, ఆకలి చూపుల పెద్దకళ్ళ, పదకొండేళ్ల 'మోతీ'యే కాని, యవ్వనాన్ని నింపుకుంటూ, కోర్కెలవెంట పరుగులు తీసే చైతన్యమూర్తియైన 'మోతీ' వచ్చి నించో లేకపోయింది!

తర్వాత నాలుగయిదు సంవత్సరాలు గడిచాయి. మేము ఈలోగా రెండు మూడు వూళ్లు మారేము. ఒకసారి మేము ఎక్కడ్నించో వస్తోండగా, బస్సు స్టాండ్‌లో కనిపించింది మోతీ. ఎర్రటి ఛౌకబారు ముతకచీరలోవున్న మోతీని నేను గుర్తుపట్టలేదు! తను నన్ను గుర్తుపట్టి పలకరించింది. 'బాగున్నారా రాధమ్మగారూ! నేను మోతీని! మర్చిపోయేరా?' అంది. నేను గుడ్లప్పగించి నిలబడ్డాను. 'మోతీ' జుట్టు వత్తుగా, మోకాలిమడతదాటి పెరిగింది. చెవులమీదకు కప్పేట్టు జుట్టుజార్చి, వదులుగా వాల్జడ వేసుకుంది. తలనిండుగా చామంతి పూలున్నాయి. అయిదడుగుల నాలుగంగుళాల పొడు గెదిగింది! గుండ్రటి జబ్బలతో, చేతికి కంటికి నిండుగావుంది మోతీ!

'కులాసాగా వున్నావా? మీ అత్తయ్యగారూ పిల్లలూ బాగున్నారా? ఇప్పు డేవూళ్లో వుంటున్నారు?' అని అడిగాను.

'ఆఁ! అంతా బాగున్నారు. పిల్లలంతా స్కూళ్లల్లో చేరారు. ఇందిరమ్మ ఉద్యోగం మానే సింది! రాజారావుగారికి ప్రమోషన్ వచ్చింది! ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చున్నాక, మా అత్తయ్యకి భలే అనుమానం పిచ్చిపట్టుకుంది! ఈ చిత్రం చూడండి రాధమ్మగారూ! మా అత్తయ్యకి అను మానం ఎక్కువయి నన్ను కూర్చున్నా నించున్నా ఒకటే సాధించిపోసేది! మా మావయ్యగారికి చూడ బోతే షేవింగ్ సెట్ దగ్గర్నించి, బూట్ల పాలిష్ చేయటంనించి, బాత్‌రూంలో సోపూ, టవలూ పెట్టటంనించి, అన్నీ నేనే చేయవాల్సివచ్చేది! ఒక్క క్షణం, తను ఆఫీసునించి రాగానే నేను ఎదురుగా కనపడకపోతే 'మోతీ ఏది?' అంటూ అడిగేసేవారు! పోనీ ఆయనకి కావాల్సిన పనులన్నీ ఇందిరమ్మత్త చేసుకోగలదా అంటే - మూడుకాళ్ల ముసలమ్మలా కూర్చున్నచోటినించి లేవలేకుండా వుండేది! చలాకీగా నాలుగు పనులూ చిన్నప్పట్నించీ చేసివున్నదాన్నికనుక, ఆయనకి ఏమి కావాల్సవచ్చినా, నన్ను పిలిచేవారు! దానితో మా అత్తమ్మ వూహ రుంజుకుపోయేది! చివ రికి ఆ అనుమానం ఎక్కువయిపోయి, నన్ను పని లోంచి తీసేసింది! చూడండి! ఆ ఇల్లాలు చదువు చెప్పిస్తానని కొన్నాళ్ళు, మంచిసంబంధం చూసి పెళ్లి చేస్తానని కొన్నాళ్లు బులిబుచ్చికాలమాటలు చెప్పి, నాచేత అడవాచాకిరీ అంతా పైసా ఖర్చుచేసి పైమనిషిని పెట్టుకోనవసరంలేకుండా చేయించు కుంది. చివరికి ఇంట్లోంచి పైసాఅన్నా చేతులో పెట్టకుండా వెళ్లగొట్టేసారు!'. దీనంగా అంది మోతీ!

'మరి ఇప్పుడెక్కడుంటున్నావు? మీ వాళ్లిం టికి వెళ్లిపోయేవా?' అన్నాను.

మోతీ నవ్వింది! ఆమె కళ్ళు తళతళా మెరిసాయి!

'మావాళ్లింటికి వెళ్లి ఏం బావుకుంటాము? నాపయిన అయిదుగురక్కలున్నారు! వాళ్లకే ఒకదారి చూపలేక మావాళ్లు తంటాలు పడుతోంటారు! ఇక నేనుకూడా వెళ్లి వాళ్ల నెత్తిమీద కెక్కటం ఎందుకు? ఒకపూటవుంటే ఇంకోపూట పస్తులు పడుకుంటారు వాళ్లు! మా నాన్న ప్యూన్ వుద్యోగం లోంచి రిటరయినాడుట! వాళ్లకి కడుపులు నిండ టానికి రూపాయలు మూటలు కట్టుకుని కూర్చో లేదుకదా! మా అక్కలు ఎవరిళ్లల్లోనో పనికి కుదురుకునివుంటారు! ఇక్కడ నేనేదో చదువులు చదువుకుని వుద్యోగస్థురాలి నవుతానని, వాళ్ళు వూహించుకుంటారు. నా కిక్కడకు వచ్చినందువల్ల వంటబట్టిన విద్య అంట్లు తోమటం, బట్టలుత కటం! అలవాటు అయిన సంస్కారం, ఏదో ఒక విధంగా కడుపు నింపుకోటం! ఈ నిజ జీవితం

వాళ్ళకి తెలియపరిచి, నేనన్నా సుఖపడుతున్నానన్న వాళ్ల భ్రమని ఎందుకు మట్టిచేయాలి?' అంది మోతీ!

నిజంగానే మోతీ చాలా ఎదిగిపోయిందనిపించింది నాకు! వాస్తవిక జీవనానికి ప్రతీక మోతీ!

'అయితే మరి ఎక్కడుంటున్నావ్!' అన్నాను.

నల్లగా పొడుగ్గావున్న మనిషి ఒకడువచ్చి, అరటిపళ్లు చామంతిపూలూ వున్న ప్లాస్టిక్ వైర్ సంచీ ఒకటి మోతీ చేతికిచ్చి

'ఇంకా బస్సువచ్చేది కాపడ్డం లేదా!' అంటూ నించున్న చోటనే తుపుక్కుమని నమలుతూన్న కారా కిళ్లీని వుమ్మేశాడు. దుబ్బులాంటి క్రాఫింగ్! నల్ల కళ్లద్దాలు! చారల పైజామాలోనుంచి అల్లిక బనీను కన్పబడుతోన్న పల్చని, తెల్లని వాయిల్ లాల్చీ! అతని వేషం అంతా నాకు అదోలా అన్పించింది.

'ఇతనితో ఈవూరు వచ్చేసాను! సినిమా హాల్లో గేటుకీపర్‌గా చేస్తున్నాడు! ముప్ఫయ్ రూపాయి లిస్తారు. నేను హోటలు అడంతాలో పప్పు రుబ్బటానికి కుదిరాను. రోజుకి తిన్నంతా టిఫెన్లుపెట్టి రెండు రూపాయిలు ఇస్తారు!' అంది మోతీ!

'ఎక్కడికి వెళ్తున్నారు?' అన్నాను.

'అతని చెల్లి పెళ్లి రాత్రికి! ప్రక్కవూరే! వెళ్తున్నాం' అంది!

అనుకోకుండా తర్వాత నాలుగైదు సంవత్సరాలకి ఇందిరమ్మ కన్పించింది. ఆ మాటా ఈ మాటా అడిగాక, మోతీ గురించి అడిగాను. ఇందిరమ్మ బాధగా నిట్టూర్చింది!

'చూడండి వదినగారూ! నా డబ్బు పాపిష్టి దయిపోయింది! కన్నపిల్లలా చూసుకున్నాను. నా పిల్లలతో సమానంగా బట్టా పాతా కొని పడేసే దాన్ని! అయినింటిపిల్లకదా! ఏదో దానికి తగ్గ సంబంధం చూసి ముడిపెట్టిద్దామనుకున్నాను. ఏదో నాకు చేతిక్రింద సాయితాగా వుంటుందని తీసుకొచ్చి పెంచాను! బుద్ధిః కర్మానుసారిణీ! అని దాని బుద్ధులన్నీ పాడుబుద్ధులయి కూర్చున్నాయి! చదువు చెప్పిద్దామని మేష్టర్ని పెట్టాము! రెండు నెల్లు గడిచినా, 'అ,' దిద్దలేదుట! ఇంకేం చేస్తాను? పోనీ కుట్టుపని నేర్చుకోకూడదా అంటే, నేను ఆ మిషన్ తొక్కలేను. నా కాళ్లు నొప్పులు పెడతాయి అనేది! పోనీ, ఏదయినా తగిన సంబంధం చూసి పెళ్ళి చేద్దామని, వాకబు చేస్తూనేవున్నా! ఇంతలో హోటల్లో సర్వరుపనిచేసే 'చిన్నారావు'ని తీసుకుని చెప్పాపెట్టకుండా ఎటో వెళ్లిపోయింది! పోనీ అతన్నే పెళ్లి చేసుకుంటానని చెప్పితే మేము కాదంటామా! సంసారం పెట్టుకుందుకు, రెండు మూడు వందలు సద్దుదుము కదా! ఏం తిప్పలు పడుతోందో! నావి నాలుగయిదు చీరలు పట్టుకుపోయింది! అవి ఎన్నాళ్లు వస్తాయి చెప్పండి! మంచితనంగా చెప్పి వెళ్లితే, ఏడాది కేదో విధంగా ఒక వందరూపాయిల సొమ్ము ముట్ట చెప్పుదుము! దొంగలాగా పారిపోయింది! ఇంక మళ్ళీ ముఖం ఎల్లా చూపెట్టుతుంది? దాని ఖర్మ అది!' ఇందిరమ్మ కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి! నా కాశ్చర్యం వేసింది. 'మోతీ'ని అనుమానించి వెళ్ళగొట్టిన ఇందిరమ్మలా ఆమె మాట్లాడలేదు! ఈ విశాల ప్రపంచంలో యవ్వనంలోవున్న ఆడపిల్లపడే అవమానాలన్నీ తలుచుకుని కుమిలిపోయే మాతృమూర్తిలా మాట్లాడింది ఇందిరమ్మ!

'వాళ్ల కన్నవాళ్లదగ్గరకు వెళ్లిపోయిందేమో!' అన్నాను.

'దానికి ఈ లోకంలో నా అని చెప్పుకోగలిగే బంధువుని నేనే! దాని తల్లీ తండ్రీ చిన్నప్పుడే పోయేరు! చనిపోతూ చనిపోతూ, దాన్ని పదేళ్లవరకూ పెంచిన అమ్మమ్మ నా చేతికి అప్పచెప్పింది, నా కర్తవ్యం నేను నిర్వహించలేకపోయేను, వదినగారూ! మాలో ఎక్కడో లోపంవుంది! అందుకనే మోతీ ఇల్లు వదిలి బిరువులా పారిపోయింది! మేము ఎంత ప్రేమగా చూసినా 'మోతీ' మా ప్రేమని నమ్మలేక పోయింది!' అంది ఇందిరమ్మ!

తల్లితండ్రులులేని అనాధ మోతీ అని నా కిప్పుడే తెలిసింది!

'తనకి తల్లీతండ్రీ తోబుట్టువులూ వున్నారని చెప్పేది మాతో!' అన్నాను.

'ఏమిటో! అందరికీ తలోక మాదిరిగానూ చెప్పేది. అమాయకురాలు!' అంది ఇందిరమ్మ.

ఆ రోజు బస్టాండ్‌లో కన్పించిన సంగతి, కూడావున్న యువకుని సంగతీ చెప్పాను.

'నల్లగావున్నతను అయితే చిన్నారావు కాదు! చిన్నారావు నాయుళ్లబ్బాయి! పచ్చగా వుండేవాడు!' అంది ఇందిరమ్మ.

'మోతీ' గురించి రోజురోజుకీ క్రొత్త విషయాలు తెలుస్తున్నాయే అనుకున్నాను. చివరికి మోతీ పదేళ్ల పిల్లప్పట్నించీ కట్టుకథలు చెప్పి, నలుగురి వల్లా సానుభూతి పొందటం అద్భుతంగా నేర్చుకుందన్నమాట! చిత్రమయిన పిల్ల అనుకున్నాను!

పన్నెండేళ్లు పూర్తి అయినతర్వాత నిన్నసాయంకాలం ఎంపోరియంలో కన్పడింది! 'మోతీ'ని మర్చిపోదామని ప్రయత్నిస్తుండగానే మళ్లీ కన్పడుతూంటుంది మోతీ! చాలా ఫాషనబుల్‌గావుంది! నైలక్స్ చీర! రెండు జడలు! చెవులకి పెద్దరింగులు, చేతికి స్క్వేర్‌వాచీ. నన్నుమటుకు మర్చిపోలేదు పాపం! నవ్వుతూ 'బాగున్నారా!' అంది.

'ఊఁ!' అన్నాను. తన జీవితం ఎల్లా గడుస్తోందో నేను అడగదల్చుకోలేదు! కనపడుతోందిగా! ఇంకా అడగటం, అన్నీ చెప్పించటం దేనికి? ముంజేతి కంకణానికి అద్దం అవసరం ఎందుకు?

నాలుగయిదు చీరలు, జాకెటుపీసులూ తీసుకుని మూడువందలు రూపాయిలదాకా బిల్లు చెల్లించింది!

'ఈ వూరికి వచ్చేరా! ఎన్నాళ్లయిందివచ్చి! మేము ఈ వూళ్లోనే వుంటున్నాము! మావారు ఇక్కడ బిజినెస్‌చేస్తూ స్థిరపడిపోయేరు! గాంధీభవన్‌కి ఎదురుగ్గావున్న సందులో వుంది మా ఇల్లు. అటుకేసి ఎప్పుడన్నావస్తే మా ఇంటికి రండి!' అంది మోతీ!

'అల్లాగే' అన్నాను! ఇంతలో 'మోతీ'కోసం వాళ్లాయన వచ్చేడు! పొడుగ్గా బలంగా వున్నాడు! తుట్టపెదవులు! గుబురుమీసాలు! గోల్డ్‌ఫ్రేమ్ కళ్లజోడు! చేతికి ఖరీదయిన వాచీ! జరీపంచె లుంగీలా కట్టుకున్నాడు! పైన టెర్లిన్ షర్టు వేసుకున్నాడు. అతన్ని చూస్తూనే—

'హల్లో పొన్నూ!' అంటూ ఈయన సంతోషంతో కావిలించుకున్నంత పనిచేశారు.

'ఇతను నా బాల్యమిత్రుడు. క్లాస్‌మేటు. పొన్నుసామి! ఈమె నా భార్య రాధమ్మ!' అంటూ ఒకరికొకర్ని పరిచయం చేశారు!

'మోతీ' ఇతన్ని ఎల్లా వల్లో వేసుకుందా అని ఆలోచిస్తూనే ఇంటికి వెళ్ళిపోయేను.

'పొన్నుసామి కిదివరకు పెళ్ళి అయ్యిందా!' అన్నాను ఆయనతో!

'నా కన్న ముందే అయ్యింది వాడికి పెళ్లి! అయిదారుగురు పిల్లలుకూడా వున్నారు! మరి ఈ 'మోతీ' ఎలా దాపరించిందో వాడికి!' అన్నారు.

'పోనీలెండి! మోతీ గురించి ఏమీ చెప్పకండి ఆయనతో!' అన్నాను.

'మోతీ' పేరు నాకిష్టం! మోతీ చిన్నప్పట్నించీ, అబద్ధాల కుప్పలా పెరిగింది! ఎందువల్ల మోతీకి అబద్ధాలు అలవాటు అయ్యేయి! దానికి మనం జవాబు చెప్పుకోలేమేమో! తనకి కావల్సినవి ఇందిరమ్మ సమకూర్చలేదనే అపనమ్మకం! తన్ని తనే నిలబెట్టుకోవాలనే అజ్ఞాతమైన ఆవేదనతో కూడుకున్న ఏకాకితనం, 'మోతీ'ని అబద్ధాల జీవితాలపాలు చేసేయి! గాలికి పుట్టి ధూళికి పెరిగే 'మోతీ' లాంటి స్త్రీలు ఈనాటి నాగరిక సమాజంలో వేలకు వేలు వున్నారు! కాని నాకు ఆ స్త్రీలందరి జీవితాలూ పరిశీలించేంత తీరుబాటు లేదు! నాక్కావల్సిన స్త్రీ 'మోతీ'! ఆ పేరు నాకిష్టం! స్వచ్ఛతకి, ధవళతకి చిహ్నం 'మోతీ'! తెల్లకుందేలుపిల్లా, తెల్లకుక్కపిల్లా, తెల్లపిల్లిపిల్లా—వీటన్నిటికంటే నేను జీవితాంతం మరువలేని రూపం నా చిన్నారి మోతీది!

నాకు బాగా జ్ఞాపకం వుంది ఇప్పటికీ! చామనచాయలో గుండ్రటి ముఖం! జాలిగొలిపే పెద్ద కళ్లు! తీరైన ముక్కు! బుల్లినోరు! అరటిదూట లాంటి వళ్లు! ఆ మోతీకీ,

'లిప్‌స్టిక్' పెదాలూ, వయ్యారాల వంపులు ప్రదర్శించే శరీరమూ, చమక్కుగాచూసే పెద్దకళ్లూ, ఎప్పుడూ బద్ధకంగావుండే సోమరితనమూ, ఈ మోతీకీ సహస్రం తేడా వుంది!

ఆ మోతీని మర్చిపోలేను!

ఈ మోతీని మర్చిపోవటానికి ప్రయత్నిస్తాను.

ఆ మోతీని అభిమానించకుండా వుండలేను.

ఈ 'మోతీ'ని అవమానించకుండా వుండగలందులకు ప్రయత్నిస్తాను!

ఆ మోతీ ఇక కన్పించదు!

ఈ మోతీ కన్పించకుండా వుండాలన్నావుండదు తన జ్ఞాపకాలను తవ్వుకుంటూ కన్పిస్తూనేవుంటుంది!